@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 09, జులై 2024 || పేజిలు: 04

## మణిపూర్‌లో మరోమారు రాహుల్ పర్యటన

- శరణార్థి శిబిరాల్లో బాధితులకు పరామర్శ

2



## మాస్కోలో ప్రధాని మోదీ

- రష్యా చేరుకున్న ప్రధాని మోడీకి ఘన స్వాగతం
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలకు మోడీ యత్నం



మాస్కో, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**ప్రధాని మోదీ రెండు** రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం రష్యాకి చేరుకున్నారు. రష్యా రాజధాని మాస్కోలో ప్రధాని విమానం ల్యాండ్ కాగానే అక్కడి అధికారులు మోదీకి రెడ్ కార్పెట్ వేసి సాదర స్వాగతం తెలిపారు. దాండియా, గర్బా నృత్యాలతో రష్యా అధికారులు ఆయనకు స్వాగతం చెప్పారు. మోదీ కోసం, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇవాళ రాత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ పర్యటనలో భారత్, రష్యాల మధ్య పలు ముఖ్యమైన ఒప్పందాలు మిగతా 2లో..



## స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు వడివడిగా అడుగులు

### ప్రతిపాధనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

- అసెంబ్లీ సమావేశాలకు ముందే నివేదికివ్వండి
- 24 గంటల్లోనే తగిన నిర్ణయం తీసుకుంటాం
- కోర్సులు, పాఠ్యాంశాలపై అధ్యయనం చేయండి
- వర్సిటీ ఏర్పాటు వ్యవహారాల పర్యవేక్షణకు.. నోడల్ డిపార్ట్‌మెంట్‌గా పరిశ్రమల శాఖ:సీఎం
- పారిశ్రామికవేత్తలు, అధికారులతో సమీక్ష..



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు** వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ఒకటి రెండు రోజుల ముందుగానే మిగతా 2లో..

## 35 మందికి నామినేటెడ్ పదవులు

- వివిధ కార్పోరేషన్లకు ఛైర్మన్‌ల నియామకం
- టీఎస్‌ఐఐసీ చైర్‌పర్సన్‌గా జగ్గారెడ్డి సతీమణి నిర్మలా రెడ్డి
- అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పొదెం వీరయ్య
- మైనింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఈరవత్రి అనీల్

2



## బీఆర్‌ఎస్‌కు మరో షాక్

- కారు దిగిన ఎమ్మెల్సీ చల్లా
- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో** ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా ఒకేసారి 'కారు' దిగేశారు. దీంతో పార్టీ నుంచి వెళ్లిపోయేవారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. అటు కాంగ్రెస్‌లో చేరికలు పెద్ద ఎత్తున కొనసాగుతూనే మిగతా 2లో..





## అనుమతివ్వలేం!

- రాష్ట్రంలో 8 కొత్త వైద్య కళాశాలకు అనుమతి నిరాకరించిన జాతీయ వైద్య మండలి
- మౌలిక సదుపాయాలు లేవని, లోపాలున్నాయని స్పష్టీకరణ
- కళాశాలల్లో వసతులపై గతంలోనే ఎన్‌ఎంసీ అసంతృప్తి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

కొత్త మెడికల్ కాలేజీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ వైద్య మండలి ఝలక్ ఇచ్చింది. మొత్తం 8 మెడికల్ కాలేజీలకు అనుమతి లేఖ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ మేరకు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు మెయిల్ పంపించింది. మౌలిక సదుపాయాలు లేకపోగా, అనేక మిగతా 2లో..

## సంక్షేమానికి మారుపేరు వైఎస్

- గాంధీ భవన్‌లో ఘనంగా వైఎస్ జయంతి
- వైఎస్‌ఆర్ సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్న వైఎస్ కల
- నెరవేర్చాలని కార్యకర్తలకు పిలుపు



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**దేశంలో సంక్షేమం అంటే గుర్తుకు వచ్చే** పేరు వైఎస్ రాజశేఖరరెడ్డి అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు వై.ఎస్. చేసిన సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని గాంధీ భవన్‌లో సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమంపై మిగతా 2లో..



## మహిళా సాధికారతకు పెద్దపీట

- స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహకాలు..
- పలు స్వయం సమృద్ధి వ్యాపారాలకు తోడ్పాటు..


హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**మహిళా సాధికారత దిశగా** ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో మహిళా సంఘాలతో తెలంగాణ వంటకాల అమ్మకం దుకాణాలు ప్రారంభించిన ప్రభుత్వం.. గ్రామీణ మహిళల ఆదాయ వనరలు పెంచే దశగా చర్యలు చేపట్టింది. వారితో నాటుకోళ్ల పెంపకం, పౌల్ట్రీ ఫారాలు, పాడి ఉత్పత్తులు విక్రయ కేంద్రాలు, సంచార చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయించనుంది. బ్యాంకుల ద్వారా వారికి మిగతా 2లో..

## నేడు పాలమూరు ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించింది. నేడు సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై జల సౌధలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు.. నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో సమా వేశమయ్యారు.

## షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్ష



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:

**షెడ్యూల్ ప్రకారమే తెలంగాణలో** డీఎస్సీ పరీక్ష నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేసి మరిన్ని పోస్టులను జత చేసి మెగా డీఎస్సీ నిర్వహించాలన్న డిమాండ్‌తోపాటు ఎగ్జామ్‌ను కొంతకాలంపాటు వాయిదా వేయాలన్న డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో.. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11వ తేదీ నుంచి డీఎస్సీ హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాబులో ఉంచనుంది విద్యాశాఖ. జులై 18వ తేదీ నుంచి మిగతా 2లో..

# మణిపూర్‌లో మరోమారు రాహుల్ పర్యటన

**ఇంఫాల్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 8:** మణిపూర్‌లోని జిరిబం, చురచంద్‌పూర్ జిల్లాలలోని పునరావాస శిబిరాలను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం సందర్శించి అక్కడ తలదాచుకున్న నిర్వాసితులతో మాట్లాడారు. గత ఏడాది మే నెలలో ప్రారంభమైన జాతుల మధ్య ఘర్షణలలో ఇప్పటి వరకు 200 మంది మరణించగా నిర్వాసితులైన పౌరులు సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు. మణిపూర్‌లోని రెండు లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న తర్వాత ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మొట్టమొదటిసారి సంక్షుభిత రాష్ట్రాన్ని సందర్శిస్తున్నారు. ఘర్షణలు ప్రారంభమైన తర్వాత రాహుల్ గాంధీ మణిపూర్‌ను సందర్శించడం ఇది మూడవసారి. ఈ ఏడాది జనవరిలో రాహుల్ తన భారత్ జోడో న్యాయ యాత్రను మణిపూర్ నుంచే మొదలు పెట్టడం విశేషం. తన తాజా పర్యటనలో రాహుల్ మొదగటా జిరిబం హయ్యర్ సెకండరీ స్కూలులో నెలకొల్పిన సహాయ శిబిరాన్ని సందర్శించారు. తాము ఎదుర్కొన్న దుర్భర పరిస్థితిని, తమ అనుభవాలను జిరిబంలో నిర్వాసితులు రాహుల్ గాంధీకి వివరించినట్లు మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కీషం మేఘచంద్ర విలేకరులకు తెలిపారు. వారికి అవసరాలు ఏమిటో కూడా రాహుల్ నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ప్రధాన మంత్రి కాని, ముఖ్యమంత్రి కాని తమ వద్దకు రాలేదని ఒక బాలిక రాహుల్‌కు చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఆ బాలిక రాహుల్‌ను కోరినట్లు ఆయన చెప్పారు. జిరిబంలో రాహుల్ గాంధీని కలుసుకునేందుకు వేలాది మంది తరలివచ్చారని, రాహుల్‌కు తమ కష్టాలు చెప్పుకుంటూ కన్నీరు పెట్టుకున్నారని మేఘచంద్ర తెలిపారు. జిరిబం నుంచి అస్సాంలోని సిల్చర్ మీదుగా రోడ్డు మార్గంలో ఇంఫాల్ విమానాశ్రయం చేరుకున్న రాహుల్ చురంద్‌పూర్ ఇజిల్లాలోని తుయిబాంగ్ గ్రామంలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాన్ని సందర్శించారు. అక్కడ కూడా ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. ప్రజలకు మద్దతు ఇవ్వడంతోపాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేయడమే రాహుల్ గాంధీ పర్యటన లక్షమని మేఘచంద్ర తెలిపారు. ఇటీవల జరిగిన ఘర్షణలలో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సమస్యలను తెలుసుకోవడం పట్ల కాంగ్రెస్ చూపుతున్న చిత్తశుద్ధికి ఈ పర్యటనే నిదర్శనమని ఆయన అన్నారు. మణిపూర్‌లో గత ఏడాది మే నెలలో మైతీ, కుకీ జాతుల మధ్య ప్రారంభమైన హింసాత్మక ఘర్షణలలో 200 మందికిపైగా ఇరుపక్షాల ప్రజలు మరణించారు.

# మాస్కోలో ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి..)

కుదుర్చుకునే అవకాశం ఉంది. రష్యా ఐదవ తరం ఫైటర్ జెట్ సుఖోయ్ 57కు సంబంధించి ఇద్దరు నేతలు చర్చించ నున్నారు. యాంటీ ట్యాంక్ షెల్స్‌ను తయారు చేయడంపై ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. ప్రధాని మోదీ రష్యా పర్యటనలో రక్షణ, చమురు రంగాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నారు. ద్వైపాక్షిక సదస్సు పేరుతో మోదీ–పుతిన్ భేటీ జరుగుతున్నప్పటికీ.. ఈ సమావేశం ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉండే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నుండి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు జెలెన్స్కీ నుండి నాటో వరకు ప్రతి ఒక్కరూ ఈ సమావేశంపై దృష్టి పెట్టారు. 2025 నాటికి భారత్, రష్యాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. రష్యా 2025 నాటికి 50 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. చెన్నై–వ్లాడివోస్టాక్ కారిడార్‌లో పెట్టుబడి ప్రణాళిక కూడా సిద్ధంగా ఉంది. రష్యా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ అక్కడి ప్రవాస భారతీయులతో సమావేశం కానున్నారు. భారతీయ సమాజాన్ని కూడా కలవనున్నారు. భారత్, రష్యాలు తమ ఆర్థిక సంబంధాలను పటిష్టం చేసుకునేందుకు దీర్ఘకాలిక దృక్పథాన్ని అనుసరిస్తున్నాయి. దీనిపై దృష్టి సారిస్తూ ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి. భారతదేశం రష్యాను తన బలమైన స్నేహితుడిగా భావిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య పలు అంశాలపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. వాటిలో ప్రధానంగా ఫైటర్ జెట్ సూజ–57పై ఒప్పందం. భారతదేశంలో యాంటీ ట్యాంక్ షెల్స్‌ను తయారీ పరిశ్రమకు సంబంధించి ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. మ్యాంగో ఆర్మర్–పియర్సింగ్ ట్యాంక్ రౌండ్ ఫ్యాక్టరీ డీల్, సైనిక లాజిస్టిక్స్ ఒప్పందంపై చర్చ, ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ప్రాధాన్యత, ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై చర్చ, రక్షణ, చమురు, గ్యాస్‌కు సంబంధించిన అంశాలపై ఇద్దరు నేతలు చర్చించనున్నారు. 2019 తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత తొలిసారిగా పుతిన్ ఆహ్వానం మేరకు మోదీ మాస్కో వెళ్తున్నారు. మాస్కోలో నివసిస్తున్న భారతీయులు ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలకనున్నారు. గత 10 ఏళ్లలో ప్రధాని మోదీ రష్యాలో పర్యటించడం ఇది ఆరోసారి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు 22వ భారత్–రష్యా వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు.

# బీఆర్‌ఎస్‌కు మరో షాక్

(మొదటి పేజీ తరువాయి..)

ఉన్నాయి. ఇదిలా ఉండగా తాజాగా మరో ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్‌ను వీడటానికి సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్సీ చల్లా భేటీ అయ్యారు. అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సాగు నీరు అందించే నెట్టెంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయాలని సీఎంను ఎమ్మెల్సీ కోరారు. ఈ రోజు లేదా రేపు కాంగ్రెస్‌లో చల్లా చేరే అవకాశం ఉంది. అయితే ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటంతో ఏమీ చేయలేని స్థితిలో గులాబీ పార్టీ ఉండిపోయింది.

# షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి..)

ఆగష్టు 5వ తేదీ దాకా పరీక్షలు జరగనున్నాయి. టెట్‌కు, డీఎస్సీకి భిన్నమైన సిలబస్ ఉండటంతో చదవడానికి సమయం సరిపోవడం లేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. ఎస్సీని 3 నెలల పాటు వాయిదా వేయాలని, అక్టోబర్‌లో 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని యువజన, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. రాష్ట్రంలో మొత్తం 11,062 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి గత ఫిబ్రవరి 28న పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల గడువు జూన్ 20వ తేదీతో ముగిసింది. మొత్తం 2.79 లక్షల దరఖాస్తులు అందాయి.

**రెండు షిఫ్టుల్లో..:** సీబీఆర్‌టీ విధానంలో రోజుకు రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. జులై 18న మొదటి షిఫ్ట్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పరీక్ష, సెకండ్ షిఫ్ట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పరీక్ష నిర్వహిస్తారు. జులై 19 నుంచి 22 వరకు వివిధ మాధ్యమాల ఎస్జీటీ పరీక్షలు జరుగుతాయి. జులై 20న ఎస్‌జీటీ, సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్ , జులై 22న స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, జులై 24న స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్, జులై 26న తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్‌టీచర్ పరీక్ష, జులై 30న స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు.

# స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు వడివడిగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి..)

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో రావాలని అధికారులతో పాటు, పారిశ్రామికరంగ ప్రముఖులకు సూచిం చారు. ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం 24 గంటల్లోనే ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన స్కిల్ యూనివర్సిటీ అంశంపై సోమవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతోపాటు పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఐటీ కంపెనీలతోపాటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ–సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న



అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువు విధించుకుని ప్రతిపాదనలను రూపొందించాలని, అసెంబ్లీ సమావేశాలకు మరో 15 రోజుల సమయం మాత్రమే ఉన్నందున.. ప్రతి ఐదు రోజులకోసారి సమావేశం కావాలని అన్నారు. సమీక్ష సమావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్‌ను సీఎం రేవంత్ పరిశీలించారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకుగాను.. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలో ఒక ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాల్సి ఉంటుందని సమావేశంలో చర్చ జరిగింది. అయితే బోర్డు ఏర్పాటయ్యే వరకు సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని సీఎం నిర్ణయించారు. దీంతోపాటు యూనివరిటీలో ఏయే కోర్సులుండాలి, ఎలాంటి కరిక్యులమ్ అందుబాటులో ఉండాలనే విషయాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లభించేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులను నిర్వహించాలనే విషయాన్ని కూడా ముందుగానే అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా? ప్రభుత్వమే బాధ్యతలు చేపట్టాలా? లేదా మరేదైనా విధానాన్ని అనుసరించాలా? అనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణుడైన కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ఏర్పాటు వ్యవహారాల పర్యవేక్షణకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, భారత్ బయోటెక్ హరిప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఐ ల్యాబ్స్ చైర్మన్ శ్రీనిరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి మారుపేరు వైఎస్



(మొదటి పేజీ తరువాయి..)

వైఎస్ చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన హయాంలో జరిగిన అభివద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ ఉపయోగపడుతోందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలకు స్ఫూర్తి రాజశేఖరరెడ్డేనని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైల్, గోదావరి, కష్ణా జలాల వినియోగం, హైదరాబాద్‌లో పెట్టుబడులకు కూడా ఆయనే స్ఫూర్తి అని రేవంత్ కొనియాడారు. వై.ఎస్. స్ఫూర్తి ని తమ ప్రభుత్వం, పార్టీ కొనసాగిస్తుందన్నారు. ఆయన చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు చేసిన పాదయాత్రే రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు స్ఫూర్తినిచ్చిందన్నారు. 2009లో రెండోసారి సీఎం అయ్యాక రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని వై.ఎస్. చెప్పారని.. కానీ రాహుల్ ప్రధాని కాకుండానే ఆయన దూరమయ్యారని విచారం వ్యక్తం చేశారు. వై.ఎస్. స్ఫూర్తితో దేశంలో కాంగ్రెస్ కార్యకర్తలంతా కొట్లాడి రాహుల్‌ను ప్రధాని చేయాలని రేవంత్ పిలుపునిచ్చారు. ఆయన అభిమానులంతా కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు.

**వైఎస్ స్థానం సుస్థిరం: డిప్యూటీ సీఎం భట్టి**

అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది మంది ప్రజల హదయాల్లో వై.ఎస్. స్థానం సుస్థిరంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన జలయజ్ఞం ఫలితంగానే నేడు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రజానీకానికి మేలు జరుగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి ప్రతిష్టాత్మక పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలను వై.ఎస్. ఆదుకున్నారని చెప్పారు. తెలంగాణ వడివడిగా అభివద్ధివైపు అడుగులు వేయడానికి వై.ఎస్. వేసిన పునాదులే కారణమన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టు, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నేడుహైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలిపారని కొనియాడారు. గాంధీభవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

## మహిళా సాధికారతకు
# పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి..)

ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించడం, వడ్డీ రాయితీలతో వారి కాళ్లపై వారు నిలదొక్కుకునేలా చేయూత అందించిన ప్రభుత్వం...వారిని వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు మరో కీలక ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళాల ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్ల పెంపకం, పౌల్ట్రీఫారాలు ఏర్పాటుతో పాటు పాడి ఉత్పత్తులు, చేపల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయిం చింది. ఈ మేరకు బ్యాంకులతో చర్చించి మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించ నుంది. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లాకు 500 మంది డ్వాక్రా సభ్యులకు పాడి పశువులు అందజేయను న్నారు. దీనికి నాలుగున్నర కోట్లు ఖర్చు కానుంది. ఒక్కొక్క సభ్యురాలికి ఒకటి లేదా రెండు పాడి గేదెలను అందజేయనున్నారు. దీనికోసం లక్ష రూపాయలు రుణం ఇవ్వనున్నారు. పశువులు మేపుకునేందుకు అనువైన ప్రాంతం ఉన్న వారికే వీటిని మంజూరు చేయనున్నారు. నాటుకోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడానికి ప్రభుత్వం సాయం అందించనుంది. ఒక్కో జిల్లాకు 3 కోట్లతో రెండు వేల డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు నాటుకోళ్లను అందించనున్నా రు. దీనికోసం ఒక్కొక్కరికీ 15వేల రూపాయల రుణం అందజేస్తారు. వీటి ద్వారా దాదాపు 100 వరకు నాటు కోళ్ల పిల్లలను తెచ్చి పెంచుకునే అవకాశం ఉంది. వీటితోపాటు కోళ్ల ఫారాలు పెట్టుకునేందుకూ ఆర్థికసాయం చేయనున్నారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఒక్కో యూనిట్‌కు రెండు లక్షల 91వేల రూపాయలు రుణం అందించ నున్నారు. సొంతంగా స్థలం ఉండి షెడ్డు వేసుకుని ఫారం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చే డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు వీటిని మంజూరు చేయనున్నారు. కోళ్ల ఫారం నిర్వహణపైనా వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సైతం ప్రభుత్వం రుణం మంజూరు చేయనుంది. పాల విక్రయ కేంద్రాలను సైతం మండలానికి ఒకటి చొప్పున మహిళా సంఘాలకు అందజేయనున్నారు. బస్టాండ్లు(ఃబీబ ఊబిజీనిట), రైల్వేస్టేషన్లు, సినిమా థియేటర్లు, రైతు బజార్లు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక్కో యూనిట్‌కు లక్షా 90వేల రూపాయల రుణం ఇవ్వనున్నారు. డ్వాక్రా సంఘాలకు ఉమ్మడి ఏపీలోనూ ప్రభుత్వాలు సాయం అందించాయి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేందుకు వారితో కుట్టుపరిశ్రమలు ఏర్పాటు చేయించారు.అలాగే డ్వాక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించారు. గేదెలు కొనుగోళ్లు రుణాలు, గొర్రెల పెంపకానికి సాయం వంటివి చేశారు. మళ్లీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కార్ మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు సాయం చేస్తున్నారు.

# అనుమతివ్వలేం!

(మొదటి పేజీ తరువాయి..)

లోపాలున్నట్లు గుర్తించడంతో అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది. సౌకర్యాలు సరిగాలేని కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో కొత్తగా గద్వాల, నారాయణపేట, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో వైద్య కళాశాలల కోసం గతేడాది ప్రభుత్వం దరఖాస్తు చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎనిమిది వైద్య కళాశాలల అనుమతులకు సంబంధించి జాతీయ వైద్య కమిషన్ లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇవ్వలేదు. అనుమతులపై జాతీయ వైద్య కమిషన్ తాజాగా కొత్త కాలేజీల ప్రిన్సిపల్స్‌కు మెయిల్ పంపింది. ఆ కాలేజీల్లో ఉన్న లోపాలను అందులో పేర్కొంది. పరిస్థితులు ఇలాగే ఉంటే కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. రాష్ట్రంలో కొత్తగా జోగులాంబ జిల్లా గద్వాల్, నారాయణ్ పేట్, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట్‌లో, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున వైద్యవిద్య కళాశాలల ఏర్పాటు కోసం సర్కారు నిరుడు దరఖాస్తు చేసింది.

జాతీయ వైద్య కమిషన్ నిబంధనల మేరకు 50 సీట్లతో ఏర్పాటుకాబోయే మెడికల్ కాలేజీల్లో 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తంగా 59 మంది ఫ్యాకల్టీ ఉండాలి. కానీ మనదగ్గర 8 కొత్త కాలేజీల్లో ప్రిన్సిపల్స్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు తప్ప మిగతా స్టాఫ్ అంటూ ఎవరూ లేరు. సీనియర్ రెసిడెంట్ వైద్యులు కూడా లేకుండానే కాలేజీల ఏర్పాటు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. కొద్ది రోజుల క్రితం తనిఖీలకు వచ్చిన ఎన్ఎంసీ బృందం జీరో ఫ్యాకల్టీ ఉండటంపై నోరెళ్లబెట్టినట్లు సమాచారం. అసలు ఫ్యాకల్టీ లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నిజానికి ఫైనల్ తనిఖీలకు చేసిన తర్వాత అన్ని నిబంధనల మేరకు ఉంటే ఎల్‌వోపీను ఎన్ఎంసీ ఇస్తుంది. ఎల్‌వోపీ వస్తే అడ్మిషన్ల ప్రక్రియకు ఎటువంటి ఆటంకం ఉండదు. కానీ ఇంతవరకు ఎల్‌వోపీనే కొత్త కాలేజీలకు రాలేదు. అలాగే కొత్త మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో అవుట్ పేషంట్స్, ఇన్‌పేషంట్స్‌పై కూడా ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని బోధనాస్పత్రుల్లో ఓపీ బాగానే ఉన్నప్పటికీ... ఐపీ మాత్రం ఎన్ఎంసీ నిబంధనల మేరకు లేవు. బోధనాస్పత్రుల్లోని ఓపీ, ఐపీ డేటాను ఎన్ఎంసీ హెల్త్‌మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎమ్ ఐఎస) ద్వారా తీసుకుంది. దాంతో ఓపీ, ఐపీల బాగోతం బయటపడింది. మెడికల్ కాలేజీల అను బంధ ఆస్పత్రుల్లోని రోజువారీ ఓపీ, ఐపీ వివరాలను హెచ్ఎమ్ఐఎస పోర్టల్‌లో ఏరోజుకారోజు విధిగా నమోదు చేయాలి. ఈ పోర్టల్‌ను కేంద్ర వైద్య ఆరో గ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిర్వహిస్తుం టుంది. కాగా ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను రాష్ట్ర ప్రభుత్వం 60 రోజుల్లోగా సవరించుకోవాలి. ఆలోగా కూడా లోటుపాట్లును సరిచేసుకోకుంటే అనుమతులివ్వదు. ఒకవేళ ఇచ్చినా... వాటిని రద్దు చేస్తుంది. కాగా ఎన్ఎంసీ లేఖల నేపథ్యంలో రాష్ట్ర వైద్య శాఖ అగమాగం అవుతోంది. ఎలాగైనా సరే కొత్త కాలేజీలన్నింటినీ ఫ్యాకల్టీతో నింపేందుకు విశ్వ ప్రయత్నం చేస్తోంది. యుద్ధప్రాతిపదికన ఆదివారం 245 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించి...వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కొత్త కాలేజీలకు పోస్టు చేసింది. అలాగే ఆ కాలేజీలకు ఒక్కో చోట 14 మంది ఆచార్యులు అవసరం. అన్నింటా కలపి 112 మంది కావాలి. కానీ ప్రస్తుతం 57 మందికే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందే అర్హత ఉంది.

# 35 మందికి నామినేటెడ్ పదవులు

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 8:** ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న కార్పొరేషన్ల పదవులను కాంగ్రెస్ సర్కార్ ఎట్టకేలకు భర్తీచేసింది. పలు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్‌గా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మలా రెడ్డిని నియమించింది. అదేవిధంగా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ను అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనీల్‌ను మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. మొత్తం 34 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జీవో విడుదల చేశారు. వీరంతా రెండేండ్ల పాటు పదవుల్లో కొనసాగనున్నారు. ఇందులో భాగంగా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్ రెడ్డి, అగ్రో పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కాసుల బాలరాజు,జంగా రాఘవరెడ్డి– ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ, మానాల మోహన్ రెడ్డి– రాష్ట్ర సహకార సంఘం చైర్మన్, రాయల నాగేశ్వరరావు– గిడ్డంగుల సంస్థ చైర్మన్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్– ముదిరాజ్ కార్పొరేషన్, మెట్టు సాయికుమార్– మత్స్య సహకార సమాఖ్య రియాజ్– గ్రంథాలయ పరిషత్, పొదెం వీరయ్య– అటవీ అభివృద్ధి సంస్థ, కాల్వ సుజాత– ఆర్యవైశ్య కార్పొరేషన్, గురునాథ్ రెడ్డి– పోలీసు హౌసింగ్ కార్పొరేషన్,గిరిధర్ రెడ్డి– సెట్విన్ చైర్మన్, జనక్ ప్రసాద్– కనీస వేతనాల అడ్వైజరీ బోర్డ్,విజయ బాబు– వ్యవసాయాభివృద్ధి కార్పొరేషన్,రాయుడు సత్యనారాయణ– హాండిక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అనితా ప్రకాశ్ రెడ్డి– ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, మన్నె సతీశ్ కుమార్– టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జబ్బార్– మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, అలేఖ్య పుంజాల– సంగీత నాటక అకాడమీ.ఈరవత్రి అనీల్– మైనింగ్ కార్పొరేషన్, పల్లా నర్సింహారెడ్డి– అర్బన్ డెవలప్‌మెంట్, ఇనగాల వెంకట్రామిరెడ్డి– కుడా చైర్మన్,నరేందర్ రెడ్డి– శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ,పటేల్ రమేశ్ రెడ్డి– స్టేట్ టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంఎ ఫహీమ్– తెలంగాణ ఫుడ్స్ బండారు శోభారాణి– ఉమెన్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్,ఎం. వీరయ్య– వికలాంగుల కార్పొరేషన్, కే.శివసేనా రెడ్డి– స్పోర్ట్స్ అథారిటీ,ఎన్. ప్రీతమ్– షెడ్యూల్డ్ క్యాస్ట్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్,నూతి శ్రీకాంత్– బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, బెల్లయ్య నాయక్– ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కే. తిరుపతి– గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్, జే. జైపాల్– వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థలకు చైర్మన్లుగా నియమితులయ్యారు.





# ఘనంగా వైయస్ఆర్ జయంతి

◆ ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ సజీవంగా ఉండే వ్యక్తి వైఎస్ఆర్



**మిర్యాలగూడ, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు గౌ,, శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి మరియు డి.సి.సి అధ్యక్షుడు గౌ,, శ్రీ కేతావత్ శంకర్ మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ నందు వై.ఎస్.ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.యస్.ఆర్ తెలుగు ప్రజల హృదయాల్లో ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటారని, వారు స్ఫూర్తితో పట్టణాలను పరిశుభ్రంగా స్వచ్ఛ పట్టణంగా తీర్చి దిద్దాలి అనే ఉద్దేశంతో ఈ జులై నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ప్రస్తుతం ఉన్న పారిశుధ్య కార్మికులతో పాటు అదనంగా వార్డ్ కి 10 మంది చొప్పున పారిశుధ్య కార్మికులను కేటాయించి, రోజుకు 12 వార్డ్ లుగా నాలుగు రోజులు 48వార్డ్ లలో స్వచ్ఛ పట్టణం కార్యక్రమం నిర్వహించి డ్రైనేజ్లను పూర్తిగా శుభ్రంగా చేయించి రానున్న ఆగస్టు 15, 78వ స్వతంత్ర దినోత్సవం వరకు మిర్యాలగూడ పట్టణంలో ప్రతీ డ్రైనేజ్ శుభ్రంగా ఉండేలా చేయబోతున్నాం అని అన్నారు.



# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**సిర్గాపూర్, (ఫోకస్ న్యూస్)-జులై 8:** సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గామ గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి. ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం అంతర్గామ గ్రామానికి చెందిన తొంటోళ్ల సుభాష్ 30 సం" ఇంటి నుండి బయటకు వెళ్లి రాత్రి అయిన తిరిగి రాకపోవడంతో కుటుంబికులు చుట్టు పక్కల, బంధుమిత్రులవద్ద వెతి కిన కనిపించక పోగ తెల్లారి మృతుని అన్నా జైపాల్ గ్రామ శివారులో వెతుకగా తంబల మాడుగులో కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపాడు. మృతుడు అప్పుడప్పుడు కరెంట్ షాక్ ఇచ్చి చేపలు పట్టేవాడని, ప్రమాదవాశాత్తు కరెంట్ షాక్ తగిలి చనిపోయాడని, తన కొడుకు మృతి పట్ల ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తండ్రి తొంటోళ్ల రాములు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహిపాల్ రెడ్డి అన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



◆ ఎంబి. బాలకృష్ణ.రైతు రాజ్యం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2013 చట్టాన్ని అనుసరించి మూడంతల పరిహారం ప్రకటించాలని రైతు రాజ్యం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎంపీ. బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్నగర్ లో జరిగే ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల సమీక్ష సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానుండడంతో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కరివేన దగ్గర 6 గ్రామాలు 4 తండాలలో కలిపి సుమారు ఎనిమిది వేల ఎకరాలను రైతులు భూములు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పలుకుబడి కలిగిన నేతలు వందల ఎకరాలు కొనుగోలు చేస్తూ ఫామ్ హౌస్ లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ రైతుల పొట్ట కొట్టారని కనీసం వ్యవసాయం చేసుకొని పొట్ట పోసుకునేందుకు కుంట భూమి లేకుండా గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గుంజుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాటిపర్తి శివారులో 20 సంవత్సరాల క్రితమే ఎకరాకు 24 లక్షల విలువ ఉండేదని ఆ లెక్కన సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు 2013 చట్టం ప్రకారం 70 లక్షల పైచిలుకు ఒక ఎకరానికి విలువ కట్టి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. నేడు పాలమూరు జిల్లా కేంద్రంలో జరిగే ప్రాజెక్టుల సమీక్ష సమావేశానికి మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానుండడంతో వారంతా రైతుల దీనస్థితిని గుర్తించి ముఖ్యమంత్రిని ఒప్పించి రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

# పీర్జాదిగూడలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

◆ నగరపాలక సిబ్బందిని అడ్డుకున్న కార్పోరేటర్లు

**మేడ్చల్ మల్కాజ్‌గిరి, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లో ఉన్న భారీ నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తున్నారు. కూల్చివేతలను బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిపై పీర్జాదిగుడా మేయర్ జక్క వెంకట్ రెడ్డి మండిపడ్డారు. పీర్జాదిగూడ మేయర్ పదవి కోసం సీలింగ్ భూముల పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అల్లుడు అమర్ సింగ్‌ను మేయర్ చేయాలని, అక్రమాస్తులను కూడబెట్టుకోవాలనే కుట్రలో భాగమే ఈ కూల్చివేతలు అని పేర్కొన్నారు. తమ నిర్మాణాలకు హెచ్ఎండీఏ, పీర్జాదిగూడ మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు ఉన్నాయి. పైసా పైసా జమ చేసి ఇంటి స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు బాధితులు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు మా స్థలాలకు ఎన్‌వోసీ కూడా ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మా నిర్మాణాలను కూల్చి వేయిస్తున్నారని బాధితులు వాపోయారు.



# కారుణ్య నియామకాల గురించి కేంద్ర రక్షణ శాఖ మంత్రికి వినతి

◆ ఈటల రాజేంద్రతో కలిసి ఢిల్లీలో మంతనాలు జరిపిన ఆరేపల్లి పరుశురామ్

◆ పరశురామ్ ను ఘనంగా సన్మానించిన కారుణ్య నియామకాల సభ్యులు



**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జులై 08:** కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగ కారుణ్య నియామకాలు కోరకు, మల్కాజ్ గిరీ పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ తో కలసి, ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిసి, కారుణ్య ఉద్యోగాల కోరకు ఒప్పించిన, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి అరేపల్లి పరశురామ్ ను, శ్రీకాంత్, మురళీ, రాజేష్, రాజేందర్, నిరంజన్, దుర్గ, మహేష్, శ్రీను లు మర్యాదపూర్వకంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాల గురించి మా పక్షాన నిలబడిన ప్రజా నాయకుడు ఆరేపల్లి పరశురామ్ అని అన్నారు. కారుణ్య నియామకాల సభ్యులు పరశురామ్ నివాసానికి వెళ్లి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య నియామకాల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రోత్సాహకాలు: కోమటిరెడ్డి

**నల్లగొండ, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** ట్రాన్స్‌జెండర్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామని అన్నారు.. చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతులకు,ట్రాన్స్ జెండర్స్‌కి స్వయం ఉపాధి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. స్వచ్ఛంద సంస్థలు మహిళల కోసం అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమనికి 2 లక్షల రూపాయల విరాళం అందజేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. సమాజంలో ట్రాన్సజెండర్స్ ను చూస్తుంటే బాధ కలుగుతుందన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనకు ఈ కార్యక్రమం తోడ్పాటు అవుతుందని చెప్పారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. శిశు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల పథకాలు అమలు చేస్తుందన్నారు. పాఠశాలలో బాలికల టాయిలెట్స్, క్లాస్ రూమ్స్, సౌకర్యాల కల్పన కోసం నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. కలెక్టర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డిఎస్సీ మూడు నెలలు వాయిదా వేయాలి

◆ స్కూల్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** తెలంగాణలో నిరుద్యోగుల నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. డీఎస్సీ రాతపరీక్షలను మూడు నెలల పాటు వాయిదా వేయాలంటూ డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాన్ని నిరుద్యోగులు ముట్టడించారు. దీంతో లక్డీకాపూల్‌లోని ఆ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. రోడ్డుపై బైఠాయించిన నిరుద్యోగులు తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు దిగిన డీఎస్సీ అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడుతూ.. డీఎస్సీ, గ్రూప్-2కు సంబంధించి ఏది వాయిదా వేయాలో అధికారులు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. అయితే గ్రూప్-2నే వాయిదా పడుతున్నట్లు అధికారులు మీడియాకు లీకులిచ్చారు. డీఎస్సీ రాత పరీక్షల షెడ్యూల్ కూడా విడుదలైంది. ఈ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ రాతపరీక్షలకు స్లాట్‌లు కూడా ఖరారు కావడంతో డీఎస్సీని వాయిదా వేయ లేమని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.ఈ పరిణామాల నేపథ్యంలో గ్రూప్-2నే వాయిదా పడుతుందని కథనాలు వచ్చాయి. అయితే డీఎస్సీ అభ్యర్థులు మాత్రం.. డీఎస్సీనే వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మాజీ సర్పంచ్ దారుణ హత్య

**వరంగల్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బురహాన్ పల్లి గ్రామమాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ రావు రాత్రి తన ఇంట్లో హత్యకు గురైనట్లు సమాచారం. మృతుడు దేవేందర్ రావు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. హత్యకు రాజకీయ కక్షలు, భూవివాదం కారణమని తెలిసింది. హంతకులు కూడా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారేనని సమాచారం. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# జై శ్రీ మార్కండేయ సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)-జులై8:** సంగారెడ్డి జిల్లా నూతన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి లోని పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు: మురళి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు: హరి హర కిషన్ సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామం ఆర్గనైజ్ కార్యదర్శి: సోలాపూర్ లక్ష్మణ్( రాజు) పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులుగా నియమితులైనారు. సంఘం ఆధ్వర్యంలో నియమితులు కావడం పట్ల పద్మశాలి సంఘ నేతలు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. నియమితులైన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# భార్యను చంపి భర్త ఆత్మహత్యయత్నం

◆ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జగిత్యాల, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** గల్ఫ్ నుంచి వచ్చిన మర్నాడు ఓ భర్త తన భార్యను కిరాతకంగా చంపేశాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తొంబర్రావు పేట గ్రామంలో లింగం(50)-రాయంచు జల(45) అనే దంపతులు నివసిస్తున్నారు. ఈ దంపతులకు కుమారుడు, కూమార్తె ఉన్నారు. కూతురుకు పెళ్లి చేయగా ఉపాధి నిమిత్తం లింగం తన కుమారుడితో కలిసి గల్ఫ్‌కు వెళ్లాడు. ఆదివారం గల్ఫ్ నుంచి తన సొంతూరుకు వచ్చాయి. భార్య రాయంచు జల గాఢ నిద్రలోకి జారుకున్న తరువాత ఆమె తలపై పారాతో కొట్టి చంపేశాడు. అనంతరం పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గండిమైసమ్మ చౌరస్తాలో వ్యక్తి ఆత్మహత్య

**మేడ్చల్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తాలో ఖాళీ ప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి చెట్టుకు ఉరేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# మందలించినందుకు టీచర్‌ను పొడిచి చంపిన విద్యార్థి

**గౌహతి, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** మార్కులు తక్కువ విద్యార్థిని ఉపాధ్యాయుడు మందలించడంతో అతడిని బాలుడు పొడిచి చంపిన సంఘటన అస్సాంలోని శివసాగర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. 11వ తరగతి విద్యార్థి రసాయన శాస్త్రంలో తక్కువ మార్కులు రావడంతో రాజేశ్ బారువా విజయవాడ(55) అనే ఉపాధ్యాయుడు బాలుడిని మందలించాడు. తలిదండ్రులను తీసుకరమ్మని ఇంటికి పంపాడు. విద్యార్థి కత్తితో పాఠశాలకు హాజరయ్యాడు. తరగతి గదిలో రాజేశ్ రాగానే అతడిపై విద్యార్థి కత్తితో దాడి చేశాడు. కత్తి తలలోకి దిగడంతో వెంటనే రాజేశ్‌ను తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఉపాధ్యాయుడు చనిపోయాడని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు విద్యార్థిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

# స్కూలు బస్సు బోల్తా

◆ 40మందికి గాయాలు

**చండీఘడ్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** స్కూల్ పిల్లలతో వెళ్తున్న బస్సు ఆకస్మాత్తుగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 40 మందికి పైగా విద్యార్థులు గాయపడ్డారు. ఈ ప్రమాదం హర్యానాలోని పంచకులలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. అదే సమయంలో ఓ మహిళ కూడా తీవ్రంగా గాయపడింది. గాయపడిన వారందరినీ పింజోర్ ఆసుపత్రి, పంచకుల సెక్టార్ 6 సివిల్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వారంతా చికిత్స పొందుతున్నారు. అయితే మహిళ పరిస్థితి విషమంగా ఉన్నందున, ఆమెను చండీగఢ్ పీజీఐకి రిఫర్ చేశారు.

# వేములవాడలో పెరిగిన రద్దీ

◆ కోడెల పంపిణీని ప్రారంభించిన ఆది శ్రీనివాస్


**వేములవాడ, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 8:** రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజన్న ఆలయంలో సోమవారంతో కావడంతో భక్తులు పోటెత్తారు. దీనికితోడు కోడెల పంపిణీ తిరిగి ప్రారంభమైంది. ఆరు నెలల క్రితం ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ప్రారంభించారు. 511 మంది రైతులకు రెండు కోడెల చొప్పున పంపిణీ చేశారు. కోడెలను ఇతరులకు అమ్మబోమని, తామే సాకి వ్యవసాయ పనులకు ఉపయోగించుకుంటామని రైతుల నుంచి అంగీకారపత్రం తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్దిదారుల ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను అధికారులు సేకరించారు. తద్వారా ఎప్పటికప్పుడు కోడెల పరిక్షరణను పర్యవేక్షించనున్నారు. ఎములాడ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కోడె మొక్కులు చెల్లించుకుంటారు. అలా వచ్చిన కోడెలు, ఆవులను ఆలయ అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తారు. వాటిని ఎప్పటికపుడు అన్నదాతలకు అందజేస్తుంటారు.

# కమల్ లాంటి నటుడిని నేనింత వరకూ చూడలేదు..

## భారతీయుడు-2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో బ్రహ్మానందం

'భారతీయుడు-2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనడం తన అదృష్టమని నటుడు బ్రహ్మానందం అన్నారు. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'భారతీయుడు 2' జులై 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం మాట్లాడుతూ కమల్ హాసన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. కమల్ హాసన్ వయసు ఎంతో నాకు తెలీదు. నేను చదువుకునే రోజుల నుంచి ఆయన్ని చూస్తూనే ఉన్నా. 'సాగర సగమం' చాలాసార్లు చూశాను. అందులో ఆయన నటించిన విధానం చూస్తే ఆశ్చర్యమేసింది. కమల్ హాసన్ శరీరంలోని ప్రతిభాగం పరిధిమేరకు నటిస్తుంది. అలా చేయగల ఏకైక నటుడు ప్రపంచంలో కమల్ హాసన్ మాత్రమే. ఆయన గొప్ప నటుడని ప్రతిఒక్కరూ అని తీరాలి. ఇండస్ట్రీలో ఉన్న నటులంతా కమల్‌హాసన్ చేసిన పాత్రల్లాంటివి ఒక్కసారైనా చేస్తే బాగుండు అనుకుంటారు.






# సరిపోదా శనివారం..
## మల్లాది నవలకు కాపీ?




నాని కథానాయకుడిగా, వివేక్ ఆత్రేయ దర్శకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'సరోపోదా శనివారం'. డివివి దానయ్య ఈ సినిమాకి నిర్మాత. ఈ సినిమా వచ్చే నెల ఆగస్టులో విడుదలవుతోంది. ఈ సినిమా నుండి ఇప్పటికే నాని మొదటి లుక్, అలాగే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక మోహన్ లుక్ కూడా విడుదల చేశారు. నాని ఈ సినిమాలో శనివారం నాడు మాత్రమే ఏదైనా చేస్తాడు అనేట్టుగా ఈ సినిమా టైటిల్ చూస్తేనే అర్థం అవుతోంది. అలాగే ప్రియాంక మొహం చారులత అనే పోలీసు పాత్రలో కనబడుతుంది అని విడుదల చేసిన ఆమె లుక్ బట్టి అర్థం అవుతోంది. ఇంతకీ ఈ సినిమా దర్శకుడు వివేక్ ఆత్రేయ ఒరిజినల్ కథనే తీస్తున్నాడా, లేదా ఎక్కడైనా ఏదైనా నవలని స్ఫూర్తిగా తీసుకున్నాడా అని నవలా సాహిత్యం చదివే వాళ్లలో ఒక చర్చ నడుస్తోంది. ఎందుకంటే ప్రముఖ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి రచించిన 'శనివారం నాది' అనే నవల అప్పట్లో సంచలం రేపిన సంగతి తెలిసిందే. అదీ కాకుండా మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన చాలా నవలలు సినిమాలుగా వచ్చిన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా మల్లాది 'శనివారం నాది' అనే నవల నుండి స్ఫూర్తిగా తీసుకున్నారా? అనే ఒక వాదం వినబడుతోంది. అయితే నవలలో కూడా కథానాయకుడు శనివారం అవగానే ఏదో ఒక సంఘటనకి పాల్పడుతూ ఉంటాడు. అందులో కథానాయకుడుకి కొంచెం నెగటివ్ షేడ్స్ ఉంటాయి. అలాగే నవలలో ఒక లేడీ పోలీసు పాత్ర మంగళ చాలా కీలకమైన పాత్ర వుంది. మరి ఇప్పుడు ఈ సినిమాలో కూడా ప్రియాంక మోహన్ పోలీసు పాత్ర చారులతగా చూపించడం చూస్తుంటే, దర్శకుడు మల్లాది నవలని ఏమైనా స్ఫూర్తిగా తీసుకున్నాడా అని అనిపిస్తోంది.అయితే ఇంతకు ముందు నాని నటించిన 'హాయ్ నాన్న' సినిమా కూడా ఇలాగే ఒరిజినల్ కథ అన్నారు. కానీ తీరా చూస్తే అది ఇంతకు ముందు శోభన్ బాబు, మంజుల నటించిన 'మంచి మనుషులు' సినిమాకి కాపీ. అప్పట్లో 'ఆ గలే లగ్ జా' అనే హిందీ సినిమాకి రీమేక్ గా 'మంచి మనుషులు' సినిమా తీస్తే నాని నటించిన 'హాయ్ నాన్న' ఈ రెండు సినిమాలకి ఫ్రీ మేక్‌గా తీశారని విమర్శలు వచ్చాయి. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా మల్లాది నవలని స్ఫూర్తిగా తీసుకొని చేశారా, లేదా ఏదైనా వేరే సినిమాకి తీసుకొని చేశారా అన్నది, దర్శక నిర్మాతలకి తెలియాలి, లేదా సినిమా విడుదలైన తరువాత తెలుస్తుంది.




# 'కల్కి' రికార్డ్లు..
## 900 కోట్లు దాటిన వసూళ్లు

ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తూ కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 11 రోజుల్లో రూ.900 కోట్లకు (గ్రాస్) పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పుడు మరో అరుదైన మైలురాయికి చేరువలో ఉంది. ఇదే హవా కొనసాగితే ఒకట్రెండు రోజుల్లో రూ.1000 కోట్లు మార్కును అందుకోవడం ఇక లాంఛనమే. అప్పుడు ఈ ఘనత సాధించిన ఏడో భారతీయ చిత్రంగా 'కల్కి' నిలుస్తుంది. మరో వైపు హిందీ ప్రేక్షకులు 'కల్కి' మూవీకి ఫిదా అవుతున్నారు. ప్రభాస్, అమితాబ్ యాక్షన్ సీక్వెన్స్, నాగ్ అశ్విన్ టేకింగ్, విజువల్ ఎఫెక్ట్స్ తదితర సన్నివేశాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్‌లో రూ.200 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన మూవీగా 'కల్కి' నిలిచింది. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత హిందీలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూవీ ఇదే కావడం గమనార్హం. ప్రభాస్ సినిమాల పరంగాఇదే రెండో అత్యధిక గ్రాస్ వసూళ్లు సాధించిన చిత్రం. నార్త్ అమెరికాలో ఇప్పటివరకూ ఏ దక్షిణాది చిత్రమూ సాధించని అరుదైన ఫీట్‌ను కల్కి సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ 16 మిలియన్ డాలర్లు వసూలు చేసినట్లు ట్రేడింగ్ వర్గాలు అంచనా వేశాయి. అంతేకాదు, బుక్ మై షోలో కోటికి పైగా టికెట్ల విక్రయమైన చిత్రంగానూ రికార్డు సృష్టించింది. హైదరాబాద్‌లోని ఎంబిఎం సినిమాస్‌లో అతి తక్కువ సమయంలో రూ.3కోట్లు కలెక్ట్ చేసిన చిత్రంగా కల్కి నిలిచింది.



# మంచు మనోజ్ కుమార్తెకు నామకరణం..

మంచు మనోజ్ దంపతులు వారి కుమార్తెకు పేరు పెట్టారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. ఏప్రిల్‌లో వీరికి పండంటి ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసిందే. ఈ పాపను తామంతా ముద్దుగా 'ఎంఎం పులి' అని పిలుచుకుంటున్నట్లు గతంలో మంచు లక్ష్మి చెప్పారు. తాజాగా ఆ పాపకు బారసాల చేశారు. ఈ ఫొటోలను మనోజ్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. కుమార్తెకు 'దేవసేన శోభా ఎంఎం' అని పేరు పెట్టినట్లు మనోజ్ తెలిపారు. 'శివుడి దయతో, మీ అందరి ప్రేమతో మా పాపకు పేరు పెట్టాం. మీ దీవెనలు కావాలి. శివ భక్తుడిగా.. సుబ్రహ్మణ్యస్వామి భార్య పేరు వచ్చేలా 'దేవసేన' అని పెట్టాం. మా అత్తగారు శోభా నాగిరెడ్డి పేరు వచ్చేలా 'శోభా' అని యాడ్ చేశాం' అని పేర్కొన్నారు. ఈసందర్భంగా మంచు లక్ష్మికి మనోజ్ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మొదటినుంచి ఆమె ఎంతో సపోర్ట్‌గా నిలిచిందన్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఆయన అభిమానులతో పంచుకోగా అవి వైరల్ అయ్యాయి. అందులో మోహన్‌బాబు దంపతులతో పాటు మౌనిక రెడ్డి కుటుంబసభ్యులు ఉన్నారు. ఈ పోస్ట్‌కు పలువురు నెటిజన్లు స్పందిస్తూ అభినందనలు చెబుతున్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో గతేడాది మనోజ్ - మౌనికలు వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లుగా నటనకు దూరంగా ఉన్న ఈ హీరో ప్రస్తుతం 'వాట్ ది ఫిష్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. నిహారిక కీలకపాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

